క్లుప్తంగా

సత్తెనపల్లిలో అన్న క్యాంటీన్ ప్రారంభం



సత్తెనపల్లి: పేద ప్రజల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల లక్ష్యమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ అవినీతి ఆంధ్రప్రదేశ్ నుంచి తిరిగి అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం అవతరించిందన్నారు. నేటితో పేదల ఆకలి కష్టాలు తీరనున్నాయని, నిరుపేదలకు గుప్పెడన్నాన్ని అందించే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు పునః ప్రారంభించబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, జనసేన నాయకుడు బొర్రా అప్పారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్, వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

సత్తెనపల్లి: పట్టణంలో పునః ప్రారంభమైన అన్న క్యాంటీన్ నిర్వహణకు ఇరువురు దాతలు రూ.1.50 లక్షలు విరాళం రూపంలో శుక్రవారం అందించారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని శ్రీవెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రేగళ్ల కోటిస్వామి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. అలాగే సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు రూ.50,002 చెక్కును మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి అన్న క్యాంటీన్ ప్రారంభం అనంతరం తాలూకా సెంటర్‌లో అందించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి వారం నియోజకవర్గంలోని ఐదు మండాలాల్లోని ఒక మండలంలో ఉంటానని, నిత్యం అందుబాటులో ఉండేందుకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. బెల్లంకొండ మండలం నుంచి శ్రీలత, రాజేష్, అచ్చంపేట మండలంలో చిన్నమ్మ, చంటి, క్రోసూరు మండలంలో అనూష, వసంత్‌కుమార్, పెదకూరపాడు మండలంలో త్రివేణి, గోగులపాటి కోటేశ్వరరావు, అమరావతి మండలంలో ధనలక్ష్మి, రామచంద్రలతో పాటు నియోజకవర్గంలో శివప్రసాద్, పాల్‌రాజ్, నరేష్‌లు ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తారని వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామంలో బోరు పంపు నీళ్లు తాగి కొంత మంది అతిసారకు గురైన సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం గత మూడు రోజులుగా కొనసాగుతుంది. శుక్రవారం మరో ఇద్దరు అతిసారతో బాధపడుతున్నట్లు గుర్తించి ఒకరిని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించగా మరొకరికి ఇంటి వద్ద చికిత్స అందిస్తున్నట్లు వైద్యుడు డాక్టర్ సాద్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు రాత్రి పగలు వైద్య శిబిరం కొనసాగుతుందని, గ్రామస్తులు ఎవరైనా అతిసార లక్షణాలు కనబడితే వైద్య శిబిరానికి రావాలని డాక్టర్ కోరారు. ఇంటింటికీ వెళ్లి అతిసార బాధితులు ఎవరైనా ఉన్నారామో తెలుసుకునేందుకు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దొడ్లేరు పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: మండల పరిధిలోని 75త్యాళ్ళూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రాజకీయ పార్టీల సమావేశం

పెదకూరపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దానియేలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏపీ ట్రాన్స్‌కో ఈఈ లోకనాథంగుప్తా



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఎస్పీ ఏఈ దుమాల సుందరరావు



ప్రశంసాపత్రం అందుకుంటున్న బగ్గి నరసింహారావు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా పలువురు ఉత్తమ అధికారులుగా గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన సంబరాల్లో వారు ఈ ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ఏపీ ట్రాన్స్‌కో ఈఈ లోకనాథం గుప్తా, సత్తెనపల్లి డివిజన్ ఎస్ఎస్పీ ఏఈ దుమాల సుందరరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావులను శుక్రవారం కార్యాలయ ఉద్యోగులతో పాటు, న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఉమాదేవి

బెల్లంకొండ: జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ బత్తుల ఉమాదేవి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబులు ఉమాదేవికి పురస్కారాన్ని అందజేశారు. ఇప్పటివరకూ జిల్లాలోని పలు కళాశాలల్లో ప్రిన్స్‌పాల్‌గా విధులు నిర్వహించడమే కాకుండా, ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్ఐవోగా ఇంటర్మీడియెట్ పరీక్షలను సమర్థంగా నిర్వహించడం, గుంటూరు డీవీఈవో బాధ్యతలు నిర్వహించారని వారు అభినందించారు. స్థానిక ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ గ్రామ ఉద్యాన సహాయకురాలిగా రజని

జిల్లా ఉత్తమ గ్రామ ఉద్యాన సహాయకురాలిగా మండలంలోని చంద్రాజుపాలెం గ్రామ సచివాలయానికి చెందిన దాసరి రజని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఉద్యాన శాఖలో జిల్లాలో ఒకరిని ఎంపిక చేశారని, బెల్లంకొండ నుంచి రజని ఎంపిక అవడం హర్షణీయమని పిడుగురాళ్ల డివిజన్ ఉద్యాన అధికారి మోహన్ తెలిపారు.



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రిన్స్‌పాల్ ఉమాదేవి



పురస్కారాన్ని అందుకుంటున్న దాసరి రజని

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

ముప్పాళ్ళ: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సత్తెనపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. మండల పీహెచ్‌సీలో దాతల సాయంతో నిర్మించిన మీటింగ్ హాలును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అభివృద్ధికి దాతలు కూడా ముందుకు రావాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల ధరలు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా నిర్మాణానికి సహకరించిన కంచర్ల కృపారావు దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మ, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, జయకృష్ణ, సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్‌ప్రతాప్, ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కరరెడ్డి, టీడీపీ నాయకులు రావిపాటి దేవేంద్రరావు, పాతూరి అయోధ్య, సిలారుద్దీన్‌బాషా, శిరిగిరి గోపాలరావు, అత్తోట కృష్ణ, మాజీ సర్పంచ్ ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో మీటింగ్ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు



అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాలలో తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యం, అనధికార విద్యుత్ కనెక్షన్లు, అదనపు లోడ్‌లకు పాల్పడిన వారిపై రూ.11.04 లక్షలు అపరాధ రుసుం వేసినట్లు విద్యుత్ ఈఈ సూర్యప్రకాష్, ఆపరేషన్ ఈఈ శ్రీనివాసరావులు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేట సెక్షన్‌లోని గ్రామాలలో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీలలో 41 మంది అధికారులు, 123 మంది సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. విద్యుత్ మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 12 మందిపై రూ.0.24 లక్షలు, మీటరు ఉండి చౌర్యానికి పాల్పడిన 17 మందిపై రూ.5.45 లక్షలు, ఇతర కేటగిరిలో వాడుకుంటున్న ముగ్గురిపై రూ.0.20 లక్షలు, అదనపు లోడ్ వాడుతున్న 106 మందిపై రూ.5.05 లక్షలు, వాడకం కంటే బిల్లు తక్కువగా ఉన్న ఒకరిపై రూ.0.10 లక్షలు, మొత్తం రూ.11.04 లక్షలు అపరాధ రుసుం వేసినట్లు చెప్పారు. అపరాధ రుసుం చెల్లించని యెడల ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరం అని ఫిర్యాదులు 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు తెలియపరచవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఈలు ఎం.రవికుమార్, కె.రవికుమార్, కె.రాజశేఖరబాబు, ఏఈలు చంద్రశేఖర్, జి.శివకోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

సత్తెనపల్లి: శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని పట్టణం, మండలంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వడ్డవల్లి పోలేరమ్మ తల్లి దేవాలయంతో పాటు వివిధ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గోత్రనామాలతో పూజలు చేయించుకుని అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రతాలు

అచ్చంపేట: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలోని దేవాలయాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సామూహికంగా వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి వ్రతం, కుంకుమ పూజలు, కన్యకాపరమేశ్వరి, లలిత, గాయిత్రీ అమ్మవార్ల అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. ఆలయ పూజారి వరలక్ష్మీవ్రతం వల్ల కలిగే ఫలితాలు, ఎలా ఆచరించాలో వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సూరే సుబ్బారావు, మణికంఠ, సూరే రామలింగస్వామి, అనుముల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: వరాలు ఇచ్చే తల్లి వరలక్ష్మీ మాతకు శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతం భక్తులు నిర్వహించారు. పెదకూరపాడులోని త్రిశక్తి పీఠం, భ్రమరాంబిక సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, 75త్యాళ్ళూరులోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. నూదురుపాటి హనుమంతురావు శర్మ, హరినాత్ శర్మల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోని పలు ఆలయాల్లో శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వరలక్ష్మీవ్రతంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. చాగంటివారిపాలెం గ్రామంలోని బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయంలో, ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, మాదలలోని సంగమేశ్వర స్వామి ఆలయంలోను ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నకరికల్లులో...

నకరికల్లు: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, దేచవరం, గుండ్లపల్లి గ్రామాల్లోని మల్లేశ్వరస్వామి దేవస్థానం, చల్లగుండ్ల, కుంకలగుంట గ్రామాల్లోని ప్రముఖ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి ఆలయంలో విశేష పూజలు

నకరికల్లు: స్థానిక కొండపై గల శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్యస్వామి వార్ల ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని భజన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో వేంచేసి ఉన్న అమ్మవారు భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి గాంచారు. శ్రావణమాసం కావడంతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్త సంఘం ఆధ్వర్యంలో భజన బృందంచే భజనా కార్యక్రమం చేపట్టారు. శ్రావణ మాసం నాలుగు శుక్రవారాలూ భజన కార్యక్రమం, ప్రత్యేక ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్త సంఘం వారు తెలిపారు.

క్రోసూరులో...

క్రోసూరు: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రావణ శుక్రవారం విశిష్టతను భక్తులకు తెలియపరిచారు.



సత్తెనపల్లిలో ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేస్తున్న మహిళలు



75త్యాళ్ళూరులో సామూహిక వరలక్ష్మీవ్రతం చేస్తున్న భక్తులు



చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఆలయంలో అమ్మవారు



విశేష అలంకరణలో నర్సింగపాడులోని అన్నపూర్ణాదేవి



నకరికల్లులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, స్వామి వార్లు



క్రోసూరులోని వాసవీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు

చేజర్లలో కార్డన్ సెర్చ్



నకరికల్లు: అనవసరపు గొడవలకు దిగి జీవితాలు జైలు పాలు చేసుకోవద్దని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు హెచ్చరించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో సిబ్బందితో, గ్రామస్తులతో మాట్లాడారు. నాటుసారా తయారీ, బెల్టుషాపుల నిర్వహణ మానివేయాలన్నారు. మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రాజకీయాల పేరుతో కొట్లాటలకు దిగితే జీవితం అంధకారమవుతుందని, ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా సహించబోమన్నారు. కార్యక్రమంలో నకరికల్లు, ముప్పాళ్ల, రాజుపాలెం ఎస్సైలు సీహెచ్ సురేష్, హజరత్తయ్య, కె.వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

హాల్ట్ కల్పించాలి.. ప్రజల ఆకాంక్ష తీర్చాలి



పెదకూరపాడు: పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె–సికింద్రాబాద్ పాసింజర్ రైలుకు హాల్ట్ కల్పించాలని పెదకూరపాడు ప్రాంత రైతులు, ప్రయాణికులు చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమం శుక్రవారం పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కన్నెగండ్ల, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో రైతులు, ప్రయాణికులు, మహిళల వద్ద నుంచి పెద్ద ఎత్తున సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు మాట్లాడుతూ హాల్ట్ కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ అక్బర్, కోరంపల్లి గురు ప్రసాద్, కాసరబాధ కోటేశ్వరరావు, కోరంపల్లి నరసింహారావు, క్రాపా సుబ్బారావులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి మార్కులు రావడానికి కృషి చేయాలి



ఎమ్మెల్యేలు కన్నా, ప్రవీణ్‌లను సత్కరిస్తున్న ఏపీ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు

సత్తెనపల్లి: విద్యార్థులకు మంచి మార్కులు రావడానికి కృషి చేయాలని స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో ఏపీ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మంచి ర్యాంకులు వచ్చి వారి మంచి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. పెదకూరపాడు శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్, ఏపీ ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజమెంట్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.తులసీరామ్, గుంటూరు జిల్లా సెక్రటరీ నాయుడు చక్రనాగ్, సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.ఏసుబాబు, సత్తెనపల్లి, పెదకూరపాడు మండల విద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, ఏకుల ప్రసాదరావులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌లను పూలమాలలు, దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ విద్యా సంస్థల అధినేతలు వెలుగూరి వెంకట సుబ్బారాయుడు, ఐ.శ్రీధర్, భవనం నాగి రెడ్డి, బి.హనిమిరెడ్డి, పత్తి రామారావు, టి.జైనేంద్రారెడ్డి, షేక్ మస్తాన్‌వలి, ఎస్.కోటేశ్వరరావు, అబ్బూరి సత్యనారాయణ, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం డైరెక్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు నూతక్కి విద్యావతికి నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లుగా శుక్రవారం ఆమె తెలిపారు. తెలుగు, ప్రాచ్య భాష విభాగంలోని ఆచార్య మాధవి పర్యవేక్షణలో తాటికోల పద్మావతి సాహిత్యం–పరిశీలన అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ పట్టా వచ్చినట్లు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, తోటి ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



రాజుపాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దేవస్థానం ప్రాంగణంలో మహిళలు, పిల్లల కోలాటం

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రెండవ రోజు ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం దేవతాహ్వానం, యాగశాలలో ద్వారాతోరణ పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పాత్తూరి వెంకటరమసుబ్బారావు దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. మొక్కపాడు బ్రహ్మం మాస్టర్ ఆధ్వర్యంలో ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెం బృందంచే మహిళలు, పిల్లల కోలాటం నిర్వహించారు. గురువారం రాత్రి శ్రీకృష్ణ తులాభారం నాటకం చూపరులను ఆకట్టుకుంది. శనివారం స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు బాలాజీ ట్రస్ట్ చైర్మన్ తెలిపారు.

నేడు పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం



విజయభాస్కర రెడ్డి

సత్తెనపల్లి: పేద విద్యార్థులకు చిట్టా ఈశ్వర సాయి చారిటబుల్ ట్రస్ట్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో శనివారం వివిధ కళాశాలల్లో విద్యనభ్యసించే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిట్టా విజయభాస్కర రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని బైపాస్‌రోడ్‌లో గల ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఈ పంపిణీ జరుగుతుందన్నారు. అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది దస్తగిరి వ్యవహరిస్తారని, అతిథులుగా న్యాయవాదులు పిన్నమనేని పాములయ్య, ఇరగంరెడ్డి ఎల్లారెడ్డి, నరిశెటి వేణుగోపాల్, చలపతిరావు, దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, గంగూరి అజయ్‌కుమార్, ఏపీపీ బగ్గి నరసింహారావు, ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు, వేద అకడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్‌లు హాజరవుతారన్నారు. 20 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందన్నారు. ట్రస్ట్ చైర్మన్ చిట్టా భరద్వాజరెడ్డి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జన్మపాపం లేని పునీతురాలు మరియతల్లి



రెంటచింతల: జన్మపాపము లేని పునీతురాలైన కన్య మరియతల్లి భూ మండలానికి రాణిగా.. దేవమాతగా.. కొనియాడబడుతుందని యహోవా దేవుడు ఆజ్ఞాపించాడని కానుకమాత చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. శుక్రవారం మరియతల్లి మోక్షారోహణం పండుగ మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీస్తు ప్రభువును అనుసరించిన తొలి క్రైస్తవురాలు పవిత్ర తల్లి, తొలి శ్రీ సభను ముందుండి నడిపించిన నాయకురాలు మరియతల్లి అని తెలిపారు. ఏసుక్రీస్తుకు విధేయురాలు, విశ్వాసి, ప్రియ మార్గదర్శిగా ప్రపంచ కథోలికులచే కొనియాడబడుతున్న కన్య మరియతల్లి ఆదర్శమూర్తిగా నిలిచారన్నారు. ముందుగా మరియతల్లి విగ్రహంతో భక్తి గీతాలను ఆలపిస్తూ.. జపమాలను చెప్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విచారణ సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.